క్లుప్తంగా

పది సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

- 14 మంది గైర్హాజరు

మాడుగుల రూరల్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం స్థానిక ఆర్సీఎం గరల్స్ హైస్కూలులో ప్రారంభమయ్యాయి. తొలి రోజు తెలుగు పరీక్షకు 32 మంది విద్యార్థులకు గాను 18 మంది మాత్రమే హాజరయ్యారు. ఈ పరీక్షకు 14 మంది విద్యార్థులు హాజరు కాలేదని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ సిస్టర్ సుజాత డోమెనిన్ శుక్రవారం తెలిపారు. డిపార్టుమెంట్ అధికారి రమణమూర్తి పర్యవేక్షణలో తొలి రోజు ప్రశాంతంగా పరీక్ష జరిగింది.

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

చోడవరం రూరల్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల కేంద్రాన్ని చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల్లోని పది పరీక్షలో తప్పిన విద్యార్థులకు కేటాయించారు. 111 మందికిగాను 59 మంది మాత్రమే తొలి రోజు తెలుగు భాష పరీక్షకు హాజరయ్యారు. సగానికి సగం వరకు 52 మంది విద్యార్థులు పరీక్షకు డుమ్మా కొట్టారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడంలో భాగంగా చోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు

మాకవరపాలెం: ఎన్నికల లెక్కింపు రోజున విజయోత్సవ ర్యాలీలు, సభలు నిర్వహిస్తే కేసులు తప్పవని ఎస్ఐ రామకృష్ణారావు హెచ్చరించారు. ఈయన శుక్రవారం మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో 820 మందిని బైండోవర్ చేశామన్నారు. వీరంతా లెక్కింపు వరకు ఎలాంటి గొడవలు, అల్లర్లు సృష్టిస్తే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కేసులు నమోదు చేస్తామన్నారు. లెక్కింపు రోజున బాణసంచా కాల్చొద్దన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా బాణసంచా కాల్చితే కఠిన చర్యలు తప్పవన్నారు.

తాగునీటి ఇబ్బందులు ఉండకూడదు

మాకవరపాలెం: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో చంద్రరావు ఆదేశించారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో ఎక్కడా ప్రజలు తాగునీటి ఇబ్బందులు పడకూడదన్నారు. బోర్లు, తాగునీటి ట్యాంకులు మరమ్మతులకు గురైతే వెంటనే వాటిని బాగు చేయించాలన్నారు. పారిశుధ్యంపైనా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఎవరూ నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు.

రోలుగుంటలో హనుమాన్ ఉత్సవాలు ప్రారంభం



స్వామివారికి పూజలు చేస్తున్న హనుమాన్ మాలధారణ భక్తులు

రోలుగుంట: స్థానిక బండారు వీధిలో హనుమాన్ ఆలయం వద్ద హనుమానోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తొలి రోజు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. కొంతమంది స్వామివారి మాలలు ధరించారు. వీరంతా తొమ్మిది రోజుల పాటు దీక్షలు ఆచరించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ అభిషేకాల కోసం భక్తులు తమ గోత్రనామాలు నమోదు చేయించుకోవాలని కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 459 బెల్లం దిమ్మలు వచ్చాయి

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,260	5,180
మొదటి రకం	4,260	5,000
రెండో రకం	3,940	4,600
మూడోరకం	3,550	4,080

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 90 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–10 యూనిట్లు, బీ పాజిటివ్–45 యూనిట్లు, బీ నెగిటివ్–1 యూనిట్, ఓ పాజిటివ్–30 యూనిట్లు, ఓ నెగిటివ్–1 యూనిట్, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు, ఏబీ నెగిటివ్–1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యా లయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

భారీ వర్షం.. రైతుల హర్షం



గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో కురుస్తున్న వర్షం



చోడవరం మండలం వెంకన్నపాలెం పరిసరాల్లో



నాతవరంలో కురుస్తున్న వర్షం



బుచ్చెయ్యపేట రోడ్డులో కారుమబ్బులతో చల్లబడ్డ వాతావరణం



వడ్డాదిలో కురుస్తున్న వర్షం

మాకవరపాలెం: భారీ వర్షంతో వాతావరణం చల్లబడింది. మండలంలో ఇటీవల కాస్తున్న భారీ ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచి భానుడు తన ప్రతాపం చూపాడు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల సమయానికి ఆకాశంలో మబ్బులు కమ్ముకుని ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. సుమారు గంటకుపైగా వర్షం కురవడంతో ప్రజలంతా ఉపశమనం పొందారు. అలాగే మెట్ట పంటలకు ఈ వర్షం ఊపిరిపోసింది. మరోవైపు వేసవి దుక్కులకు కూడా మేలు చేసిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కారణంగా మండలంలోని కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

మెట్ట పంటలకు మేలు

గొలుగొండ: మండలంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. మూడు గంటల పాటు కుండపోత వర్షం కురవడంతో చెరకు, సరుగుడు, అరటి, కూరగాయల సాగుకు ఎంతో మేలు కలుగుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వేసవి ఎండల నుంచి పూర్తిగా ఉపశమనం పొందారు. ఈ వర్షం వల్ల పొలాల్లో పశుగ్రాసం పెరుగుతుంది. పాడి పశువులకు ఎంతో మేలు కలుగుతుంది. దారకొండ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షంతో కొద్దిపాటి వర్షం నీరు దారగెడ్డ నుంచి ప్రవహించింది.

చోడవరం: భారీ వర్షంతో చోడవరం పరిసర ప్రాంతాల ప్రజలు సేద తీరారు. శుక్రవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ కాసినప్పటికీ సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. మరో పక్క ఉరుములతో జనమంతా బెంబేలెత్తిపోయారు. పొలాల్లో రైతులు ప్రాణాలు అరచేత్తో పట్టుకొని పాకల్లోకి పరుగులు తీశారు. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది.

పంటలకు ఊపిరి పోసిన వర్షం

రోలుగుంట: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం పడింది. ఈ వర్షం పంటలకు, పల్లపు, మెట్ట భూముల్లో దుక్కులు చేసుకునేందుకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల మొదటి వారంలో కురిసిన వర్షాలకు కొమరవోలు, నిండుగొండ, రోలుగుంట, శరభవరం, రత్నంపేట, వడ్డిప తదితర గ్రామాల్లో రైతులు 150 ఎకరాల్లో చెరకు నాట్లు, 350 ఎకరాల విస్తీర్ణం పైబడి సరుగుడు మొక్కలు నాటారు. తర్వాత ఎండలకు వడిలిపోతున్న తరుణంలో తాజాగా కురిసిన వర్షం ఊపిరి పోసిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చల్లబడ్డ వాతావరణం

బుచ్చెయ్యపేట: ఎండ తీవ్రత, ఉక్కపోతకు తాళలేకపోతున్న ప్రజలు శుక్రవారం బుచ్చెయ్యపేటలో కురిసిన భారీ వర్షంతో ఉపశమనం పొందారు. శుక్రవారం ఉదయం నుంచి సాయింత్రం వరకు తీవ్ర ఎండకాయగా, సాయంత్రం మూడున్నర గంటల నుంచి ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకుని ఈదురు గాలులతో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పలు గ్రామాల్లో రోడ్లపై వర్షం నీరు చేరింది. ఈ వర్షం వేసవి దుక్కులు దున్నుకోవడానికి పశుగ్రాసం పెరగడానికి ఎంతో ఉపయోగంగా ఉంటుందని రైతులు తెలియజేస్తున్నారు.

వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాతవరం: ఈదురు గాలలతో కూడిన వర్షం కురవడంతో రైతులకు ఉపశమనం కలిగించింది. మరోవైపు ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలంలో శుక్రవారం ఉదయం నుంచి తీవ్రమైన ఉక్కపోతతో ఎండ కాచి ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం కురిసింది. ఆ సమయంలో వీచిన గాలులకు పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సరఫరా నిలిచిపోయింది. దాంతో మండల వ్యాప్తంగా వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రధానంగా ప్రతి గ్రామంలో సాయంత్రం 4 నుంచి 6 గంటల మధ్యలో ట్యాంకులకు తాగునీరు ఎక్కించి ప్రజలకు సరఫరా చేస్తుంటారు. అదే సమయంలో విద్యుత్ లేకపోవడంతో పలు గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తింది.

పాలిసెట్ ర్యాంకర్లకు అభినందన



పాలిసెట్ ర్యాంకర్లతో రమణ, శ్రీను

దేవరాపల్లి: పాలిసెట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు కె.వి.రమణ అభినందించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక మండలాధ్యక్షుడు కొరుపోలు శ్రీను ఆధ్వర్యంలో స్థానిక ఉషోదయ స్కూల్‌లో ఏప్రిల్ నుంచి ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ మండల వ్యాప్తంగా 120 మంది విద్యార్థులు తర్ఫీదు పొందారు. వీరిలో ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో బుగత యమున, రాయపురెడ్డి శ్రీహరి, బూడి దుర్గాప్రసాద్, లెక్కల శిరీషా, గొర్లి శ్రావ్య తదితరులు ఐదు వేలలోపు ర్యాంక్‌లను సాధించారు. నెల రోజు శిక్షణలోనే ప్రతిభ చూపిన వీరిని శుక్రవారం కె.వి.రమణ అభినందించారు. గ్రామీణ పేద విద్యార్థులను విద్యాపరంగా మరింత ప్రోత్సహించడంలో భాగంగా నాలుగేళ్లుగా ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ ఇవ్వడం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. కోచింగ్ నిర్వాహకుడు శ్రీనుతోపాటు బోధకులు కె.జ్ఞానేశ్వరరావు, రమేష్, సురేష్, అజయకుమార్‌లను ఉషోదయ స్కూల్ డైరెక్టర్లు పెద్దాడ వెంకటరమణ, వేచలపు అప్పలనాయుడు తదితరులు అభినందించారు.

29న మండల సర్వసభ్య సమావేశం



ఎంపీడీవో రాంబాబు

నాతవరం: ఈ నెల 29వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని ఎంపీడీవో జాగరపు రాంబాబు శుక్రవారం తెలిపారు. ఎంపీపీ ఎస్. లక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరు కావాలన్నారు. మండల స్థాయి అధికారులంతా శాఖల వారీగా సమగ్ర సమాచారంతో పాల్గొనాలన్నారు. వచ్చే నెల 4వ తేదీ కౌంటింగ్ అయ్యేంత వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికలు కమిషనర్ ఆదేశాలు అనుసరించి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామన్నారు.

ఆయుర్వేదం.. అద్భుత వైద్యం

ఆయుర్వేదం.. ప్రాచీన భారతీయ వైద్యం. సైడ్ ఎఫెక్ట్స్ తావులేని చికిత్సా విధానం. అందుకే నేటికీ ఆయుర్వేదంపై ప్రజలకు అంత నమ్మకం. కరోనా తర్వాత ఆ నమ్మకం పదింతలయింది. అందుకు కశింకోటలోని కన్నూరుపాలెం ప్రభుత్వ ఆయుర్వేద ఆస్పత్రికి రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణే నిదర్శనం. వందేళ్ల చరిత్ర కలిగిన ఈ ఆయుర్వేద వైద్య నిలయం ప్రస్తుతం మరింత ఆధునిక వసతులతో రోగులకు సేవలందిస్తోంది.



కన్నూరుపాలెంలో ఉన్న ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి



ఆస్పత్రి ఆవరణలో పెంచుతున్న ఆయుర్వేద ఔషధ మొక్కలు

- కన్నూరుపాలెం ఆయుర్వేదిక్ ఆస్పత్రికి ఆదరణ
- ప్రభుత్వ సహకారంతో పెరిగిన వసతులు
- షెడ్ ఏర్పాటైతే అందుబాటులోకి పంచకర్మ చికిత్స
- దాతల ఆర్థిక సాయం కోసం నిరీక్షణ

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెంలో ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రికి క్రమేపీ ఆదరణ పెరుగుతోంది. సుదూర ప్రాంతాల నుంచి రోగులు ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. ఆస్పత్రిలో ఆధునిక సదుపాయలు కల్పించి వైద్య సేవలు మెరుగుపర్చారు. వైద్యుల ఆదరణ, దుష్ప్రభావాలకు తావులేని చికిత్స కావడంతో ఆయుర్వేదిక్ వైద్య విధానంపై మక్కువ చూపుతున్నారు.

వైద్యంలో వందేళ్ల చరిత్ర

కన్నూరు పాలెం ఆయుర్వేదిక్ ఆస్పత్రికి వందేళ్ల చరిత్ర ఉంది. శిథిల భవనంలో నడిచే ఆస్పత్రికి దశాబ్దం క్రితం మరో భవనం నిర్మించారు. ప్రస్తుత ప్రభుత్వం దాన్ని సుమారు రూ.5 లక్షలు వెచ్చించి ఆరు నెలల క్రితం అన్ని సదుపాయాలు కల్పించింది. ఆస్పత్రి పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దింది. దాదాపు అన్ని వ్యాధులకు మందులు, ఆధునిక పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. దీంతో స్థానికులతోపాటు నర్సీపట్నం, మాకవరపాలెం, హరిపాలెం తదితర దూర ప్రాంతాల నుంచి రోగులు వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు.

అవగాహన పెరిగింది

గతంలో స్థానికులు మాత్రమే అదికూడా అరకొరగా ఆస్పత్రి సేవలు వినియోగించుకునే వారు. గత కొన్ని మాసాలుగా ఆస్పత్రి వైద్యులు ఆయుర్వేద వైద్యం పట్ల ప్రజల్లో అవగాహన పెంచుతున్నారు. విద్యా సంస్థలు, గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, ఆయుర్వేద వైద్యం, యోగా, ధ్యానం ప్రయోజనాలను ప్రచారం చేస్తున్నారు. ఆస్పత్రి ఆవరణలోనే ఆయుర్వేద ఔషధ మొక్కల పెంపకం చేపట్టారు. వాటిపై ఆస్పత్రికి వచ్చే రోగులకు అవగాహన కలిగిస్తున్నారు. దీంతో ప్రజల్లో మార్పు వచ్చింది. ఆస్పత్రి ఆవరణలో ప్రత్యేక షెడ్ ఏర్పాటుకు దాతల కోసం సిబ్బంది ఎదురు చూస్తున్నారు. త్వరలో పంచకర్మలు అందుబాటులోకి తీసుకురావాలని యోచిస్తున్నారు.

సదుపాయాలు పెరిగాయి



గతంలో ఆయుర్వేద ఆస్పత్రికి అంత ఎక్కువ సంఖ్యలో రోగులు వచ్చేవారు కాదు. మేం కూడా ఎక్కువగా ఇంగ్లీష్ మందులే వాడేవాళ్లం. కరోనా సమయంలో ఆయుర్వేద మందులు బాగా పనిచేశాయి. దీనికితోడు ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రిలో సదుపాయాలు మెరుగుపర్చారు. చాలా వ్యాధులకు అవసరమైన మందులన్నీ ఆస్పత్రిలోనే ఉచితంగా ఇస్తున్నారు. దీంతో చాలా సమస్యలకు ఆయుర్వేద మందులే వేసుకుంటున్నాం. పక్క గ్రామాల నుంచీ రోగులు ఇప్పుడు వస్తున్నారు.

– కూండ్రపు అచ్చియ్యనాయుడు, కన్నూరుపాలెం

నమ్మకం పెరిగింది



ఆయుర్వేదిక్ ఆస్పత్రికి స్థానికులతోపాటు సుదూర ప్రాంతాల నుంచి రోగులు వస్తున్నారు. ఆయుర్వేద వైద్యంపై రోగుల్లో నమ్మకం పెరిగింది. తరచూ వైద్య శిబిరాలు నిర్వహించి ఆయుర్వేద వైద్య విధానంపై అవగాహన కల్పిస్తున్నాం. దీంతో రోగుల సంఖ్య పెరుగుతోంది. రోజూ కనీసం 25 మందికి చికిత్స అందిస్తున్నాం. ఆస్పత్రిలో రోగులకు అవసరమైన ఆధునిక పరికరాలు, వసతుల్ని ప్రభుత్వం కల్పించింది. సీజనల్ వ్యాధులతోపాటు దీర్ఘ కాలిక వ్యాధులకూ వైద్యం అందిస్తున్నాం.

– డా.టి.శిరీష, వైద్యాధికారి, ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి, కన్నూరుపాలెం

ఓట్ల లెక్కింపు విధి విధానాలపై అవగాహన



అధికారులతో సమావేశమైన రిటర్నింగ్ అధికారి జయరాం

నర్సీపట్నం: ఓట్ల లెక్కింపు విధి విధానాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హెచ్.వి.జయరాం పేర్కొన్నారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, ఎంసీసీ నోడల్ అధికారులతో శుక్రవారం ఆయన తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఓట్ల లెక్కింపు విధి విధానాలపై చర్చించారు. ఎన్నికల కమిషన్ గైడ్ లైన్స్‌కు లోబడి పని చేయాల్సి ఉంటుందన్నారు. ఓట్ల లెక్కింపు సిబ్బందికి సమగ్రమైన అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కౌంటింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపునకు 14 టేబుల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. మొదటిగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు ఉంటుందన్నారు. అనంతరం ఈవీఎంల లెక్కింపు ఉంటుందన్నారు. 18 రౌండ్‌ల్లో ఓట్ల లెక్కింపు పూర్తవుతుందన్నారు.

30న ఆలయ భూముల కౌలు వేలం

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో మూడు దేవాలయాల భూములను మూడేళ్లపాటు పాటు కౌలు చేసుకోవడానికి ఈ నెల 30న వేలం పాట నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 2027 మే 31వ తేదీ వరకు వేలం దక్కించుకున్న కౌలు రైతులు సాగు చేసుకోవచ్చన్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి వడ్డాదిలో సర్వే నంబర్ 176–5ఏలో 5.50 ఎకరాలు, 176–5ఏలో 1.50 ఎకరాలకు రూ.10 వేలు ధరావత్తు ముందుగా చెల్లించి 30వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ఆలయం వద్ద నిర్వహించే వేలంలో పాల్గొనాలన్నారు. మల్లికార్జున స్వామి ఆలయానికి సంబంధించి వడ్డాదిలో సర్వే నంబర్ 37–16లో 3.42 ఎకరాలు, 37–17లో 4.44 ఎకరాలకు రూ. 2 వేల వంతున ధరావత్తు ముందుగా చెల్లించి ఆలయం వద్ద 30వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు జరిగే వేలం పాటలో పాల్గొనాలన్నారు. వడ్డాది రామలింగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి విజయరామరాజుపేట రెవెన్యూలో సర్వే నంబర్ 4–21లో 2.63 ఎకరాలకు ధరావత్తు రూ.5 వేలు, సర్వే నంబర్ 4–25లో 50 సెంట్లకు రూ.2 వేలు ధరావత్తు ముందుగా చెల్లించి 30వ తేదీన ఉదయం 11 గంటలకు ఆలయం వద్ద జరిగే వేలం పాటలో పాల్గొనాలన్నారు. ఆ రోజు వేలంలో పాట పాడినవారు మొదటి సంవత్సరం సొమ్ము అదే రోజు దేవస్థానానికి చెల్లించాలని ఈవో సూచించారు.

ఉపాధ్యాయులకు ఘన సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సర్పంచ్ కోటేశ్వరరావు, తదితరులు

కె.కోటపాడు: రొంగలినాయుడుపాలెం ప్రాథమిక పాఠశాలలో ప్రతి విద్యార్థిపైనా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ మంచి ఫలితాలు సాధిస్తున్నారని సర్పంచ్ పైల కోటేశ్వరరావు తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికిగాను ఏపీ రెసిడెన్షియల్ స్కూల్లో గ్రామానికి చెందిన ఏడుగురు విద్యార్థులు అర్హత సాధించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు రెసిడెన్షియల్ సీట్లను సాధించడంలో ప్రత్యేక బోధన అందించిన హెచ్ఎం శ్రీను, ఉపాధ్యాయుడు సూరిబాబులను అభినందించారు. ఈ సందర్భంగా గ్రామంలో శుక్రవారం వీరిని గ్రామస్తులు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు గొర్రుపోటు పైడంనాయుడు, రొంగలి నారాయణరావు, స్ఫూర్తి యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

యువతకు యూనియన్ బ్యాంకు రుణ ఆసరా

15 రోజుల్లో రూ.32.35 కోట్ల రుణాల మంజూరు



లోన్ ద్వారా తీసుకున్న కారుకు తాళం అందిస్తున్న యూనియన్ బ్యాంక్ డీజీఎం శంకర్‌హోమ్‌రామ్

అనకాపల్లి: విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్యాంకుల ద్వారా ఎడ్యుకేషన్ లోన్లు మంజూరు చేస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శంకర్‌హోమ్‌రామ్ తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా రిటైల్ ఎక్స్‌పో–2024కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. అనకాపల్లి పట్టణ పరిధిలో 23 యూనియన్ బ్యాంకు శాఖలు ఉన్నాయని, వాటి ద్వారా 15 రోజుల్లో హౌసింగ్, వెహికల్, ఎడ్యుకేషన్ లోన్ల రూపంలో రూ.32.35 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వాలు ఆదేశాల మేరకు చిరువ్యాపారాల నుంచి పెద్దపెద్ద కంపెనీల ఏర్పాటు వరకు నిరుద్యోగ యువతీ, యవకులకు సబ్సిడీ లోన్లు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ నరేష్, బ్యాంకుల చీఫ్ మేనేజర్లు దుర్గాప్రసాద్, మనీష్ కుమార్, పి.వి.ప్రసాద్, ఉద్యోగులు సత్యనారాయణ, చంద్రశేఖర్, ఖాతాదారులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యకర జీవనం



జార్జిక్లబ్‌లో యోగాసనాలు వేస్తున్న ట్రస్ట్ సభ్యులు



స్విమ్మింగ్ పూల్‌లో యోగాసనాలు వేస్తున్న ట్రస్ట్ సభ్యులు

ఘనంగా భారత స్వాభిమాన్ ట్రస్ట్ వార్షికోత్సవం

అనకాపల్లి: నిత్యం యోగాతో ఆరోగ్యంగా జీవించవచ్చని భారత స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమ్మనాయుడు తెలిపారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో ట్రస్ట్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక యోగాసనాలు, స్విమ్మింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా తర్వాత యోగాపై ప్రజల్లో ఆసక్తి పెరిగిందన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా ఉదయం, సాయంత్రం సమయంలో యోగాసనలు వేయడం ద్వారా చాలా వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చన్నారు. దశల వారీగా పలు ప్రాంతాల్లో యోగా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజులపాటు పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. తొలి రోజు కార్యక్రమంలో భాగంగా ఈశ్వర్ స్విమ్మింగ్ పూల్‌లో శ్వాసపై ధ్యాస పెంపొందించేందుకు జలాసనాలు నిర్వహించినట్లు తెలిపారు. 25న యోగాపై అవగాహన కార్యక్రమాలు, 26న పతంజలి యోగపీఠ్, హరిద్వారకు చెందిన పూజ్యస్వామి రిత్ దేవ్ మహారాజ్ జీ, జొన్నలగడ్డ శ్రీనివాసులు విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు బీఎస్ఎంకే జోగినాయుడు, బుద్ధ కాశీవిశ్వనాథ్, సభ్యులు వి.చంద్రశేఖర్, బీమశెట్టి శ్రీనివాసరావు, జి.మంగయ్య, కేవీవీ సత్యనారాయణ, కాండ్రేగుల చిన్న, కోలాపర్తి కన్నబాబు, పెంటకోట సుబ్రహ్మణ్యం, కర్రి గంగాధర్, రోహిణి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థం

హుకుంపేట: బాల్యా వివాహాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో బాలచంద్రమణిదేవి అన్నారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ఏజేన్సీలో బాల్య వివాహాల వల్ల అనర్థాలు కలుగుతాయని, ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సూపర్‌వైజర్లు హసీనా, అప్పలనర్సమ్మ పాల్గొన్నారు.

కాఫీ హౌస్ ప్రారంభం

జి.మాడుగుల: కాఫీని పౌడర్‌గా చేసి విక్రయించేందుకు పలు ఔట్‌లెట్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు నిట్టాపుట్టు, గిరిమిత్ర, వేమలదుర్గా, జన జాగృతి మేక్స్ సీఈవోలు చెప్పారు. నిట్టాపుట్టు గ్రామంలో శుక్రవారం మేడికొండ కాఫీ హౌస్‌ని ప్రారంభించారు. కాఫీ పౌడర్ కావల్సిన వారు ఆన్‌లైన్‌లో బుకింగ్, లేదా తమ ఔట్‌లెట్ల ద్వారా అందజేస్తామన్నారు.